## కార్తీకమాసం..శివయ్య ఆలయంలో సంబరం

శ్రీకాళహస్తి, అక్టోబర్ 31 ప్రభాతవార్త



కార్తీకమాసం తొలిసోమవారం సందర్భంగా ఆలయంలో పలువురు మహిళా భక్తులు దీపాలు వెలిగించి మొక్కులుతీర్చుకున్నారు. ఆలయంలో ఎక్కడ చూసినా ఇసుకేస్తేరాలనంత జనం కనిపించింది. సాయంత్రం ఆలయంలో ప్రదోష వెండినందివాహనంపై పరమేశ్వరుడు దర్శనమివ్వగా పురవీధుల్లో అంబారీ ఉత్సవంపై స్వామిఅమ్మవార్లు దర్శనమిచ్చారు. ఇక ఆలయాన్ని చక్కగా విద్యుత్‌దీపాలతో ముస్తాబుచేయగా బిక్షాలగోపురం నుంచి కన్నప్ప కొండపై ఉన్న స్వామిఅమ్మవార్ల విగ్రహాలు భక్తులకు కనువిందుచేస్తున్నాయి.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## శివాలయాల్లో కార్తీక దీపోత్సవం

పుత్తూరురూరల్, అక్టోబరు 31 ప్రభాతవార్త:



పుత్తూరు మండల పరిధిలోని పలు శివాలయాల్లో కార్తీక సోమవారం సందర్భంగా ఆలయాల్లో దిపోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయం రామలింగేశ్వర స్వామి ఆలయం, అలాగే మండల పరిధిలోని తిరుమలకుప్పం, తొరూరు, నేసనూరు, మూలకోన ఆలయాల్లో కామాక్షి దేవికి ఈశ్వరుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పట్టణంలోని శివాలయంలో ఆలయ చైర్మన్ కొడగంటి రమేష్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలుచేశారు. మహిళలు దీపాలు వెలిగించారు.

## వెంటాడి..కళ్లలో కారం కొట్టి..

# దారుణ హత్య

### దొనబావి వద్ద సంఘటన.. ద్విచక్రవాహనంలో పరారైన దుండగులు



దామోదరం మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

పెద్దపంజాణి అక్టోబర్ 31 ప్రభాతవార్త :

దీపావళి పండుగ కోసం అత్తారింటికి వచ్చిన భర్త తన భార్యతో కలసి ద్విచక్రవాహనంలో స్వగ్రామంకు తిరుగు ప్రయాణం కాగా గుర్తు తెలియని దుండగులు వారిని వెంబడించి జనసంచారం లేనిప్రాంతంలో అటకాయించి భర్త కళ్లలో కారంచల్లి విచక్షణా రహితంగా కత్తులతో దాడి చేసి హతమార్చిన సంఘటన సోమవారం రాత్రి పెద్దపంజాణి మండలం ఇటుకనెల్లూరు సమీపాన దొనబావి వద్ద చోటుచేసుకుంది. ఈ హత్య మండలంలో సంచలనం కలిగించింది, హత్య చేసిన అనంతరం హంతకులు ద్విచక్రవాహనంలో పారిపోయారు. ఈ సంఘటనకు సంబందించి ఎస్ఐ స్వర్ణతేజ,స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా..పుంగనూరు నియోజకవర్గం బత్తలాపురం గ్రామానికి చెందిన రెడ్డెప్ప కుమారుడు దామోదరం(26)కు పెద్దపంజాణి మండలం పెద్దకాప్పల్లి పంచాయతీ పెనుగొలకలకి చెందిన చంద్రమోహన్ కుమార్తె అనురాధతో సుమారు ఏడాది క్రితం వివాహమైనట్లు తెలిపారు.వీరి కాపురం అన్యోన్యంగా సాగుతోంది. ఇటీవల దీపావళి పండుగ సందర్భంగా దామోదరం తన భార్య అనురాధతో కలసి పెనుగొలకల గ్రామంలోని అత్తగారి ఇంటికి వచ్చాడు. సోమవారం పండుగ ముగుంచుకొని తమ అత్తగారి ఇంటినుంచి దామోదరం తన భార్య అనురాధతో కలసి ద్విచక్రవాహనంలో తన స్వగ్రామానికి కొత్తకోట మీదుగా బయలుదేరాడు. కాగా వీరు బయలు దేరిన మార్గంలో ఇటుకనెల్లూరు తరువాత ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు వీరిని ద్విచక్రవాహనంలోనే వెంబడించారని తెలిపారు. మార్గమధ్యంలో దొనబావి వద్ద దుండుగులు దామోదరంను అటాకాయించి కళ్లలో కారం చల్లినట్లు దామోదరం భార్య అనురాధ పేర్కొంది. అనంతరం వెంటనే తన భర్తను విచక్షణా రహితంగా కత్తులతో దాడిచేయడంతో అక్కడికక్కడే కుప్పకూలాడని, దుండగులు ద్విచక్రవాహనంలో పారిపోయారని తెలిపారు. సమాచారం తెలుసుకున్న గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు దీంతో ఎస్ఐ స్వర్ణతేజ సిబ్బందితో కలసి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.మృత దేహాన్ని పంచనామా నిమిత్తం ఆసుపత్రికి తరలించి ఎస్ఐ కేసు నమోదు చేసి, దామోదరం హత్యకు పాత కక్షలు ఉన్నాయా లేక మరేఇతర కారణాలు ఉన్నాయా అనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## తిరుపతిలో యువకుడి హత్య

తిరుపతి క్రైం, అక్టోబర్ 31, ప్రభాతవార్త

యువకుడిని దారుణంగా హత్య చేసిన సంఘటన నగరంలో చోటు చేసుకుంది. ఈస్ట్ సిఐ శివప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. విజయవాడకు చెందిన పండు (35) తిరుపతి నెహ్రూవీధిలో ఓ ప్రైవేట్ లాడ్జిలో ఉంటున్నాడు. సోమవారం రాత్రి లాడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి పండును గొంతు కోసి దారుణంగా హత్య చేశాడు. స్థానికుల సమాచారంతో సిఐ శివప్రసాద్ రెడ్డి సంంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.



హత్యకు గురైన పండు

# అల్పపీడనంపైనే ఆశలు

### అక్టోబర్‌లో అడుగంటిన వర్షం - సాధారణ వర్షపాతం కన్నా సగం మాత్రమే
### తడ ప్రాంతంలో ఎండుతున్న పైర్లు - చుక్కనీరు లేని చెరువులు

తడ, అక్టోబర్ 31 ప్రభాతవార్త

తడ మండలంలో అక్టోబర్ నెల గడిచినప్పటికీ వ్యవసాయానికి తగినంత వర్షం కురవలేదు. సాధారణంగా ఇక్కడ అక్టోబర్ నెలలో నదులు, కాలువలో పొంగి ప్రవహిస్తుంటాయి. అయితే ఈ సారి సగం వర్షం కూడా నమోదు కాలేదు. దీనితో పంట కాలువలు ఎండిపోయాయి. చెరువులకు చుక్క నీరు చేరలేదు. ఒక్క పాముల కాలువ సమీపంలో మాత్రమే వరినాట్లు వేసుకున్నారు. అది కూడా ఈ నెల రెండో వారంలో కురిసిన తేలికపాటి వర్షాలతో రైతులు వ్యవసాయం పనులు ప్రారంభించారు. మళ్లీ చినుకు జాడ లేకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. తడ మండల గ్రామాలకు దూర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వరినాట్లు వేసే కూలీలంతా పనుల్లేకుండా ఉన్నారు. వీరిని ఇక్కడి దాకా తీసుకొచ్చిన రైతులకు వారిని వెనక్కి పంపించడం సాధ్యం కావడం లేదు. మళ్లీ కూలీలను తీసుకురావాలంటే అదనపు ఖర్చులు తడిసి మోపెడవుతాయని భయ పడుతున్నారు. తడలో అక్టోబర్ నెల సాధారణ వర్షపాతం 266 మిల్లీమీటర్లు కాగా, ఈ ఏడాదిలో ఈ నెలలో కేవలం 134 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇప్పటికి 800 ఎకరాలలో వేసిన ఎలిది పైరు, వెయ్యి ఎకరాల్లో నాటుకున్న వరిపైరు ఎండిపోయే దశకు చేరుకున్నాయని రైతులు తెలిపారు. మరో రెండు వేల ఎకరాల్లో వరినాట్లు వేసుకోవడానికి నార్లు సిద్ధంగా ఉన్నాయంటున్నారు. ఈ నార్లు మరో పదిరోజులు గడిస్తే ముదిరిపోతా యని భయపడుతున్నారు. ఇక బంగాళాఖాతంలో అల్పపీడనం పుట్టిందన్న వార్తలు మాత్రం రైతుల్లో ఆశలు చిగురింపచేస్తున్నాయి. ఒకవేళ తుపాను వచ్చినా వర్షం కురుస్తుందన్న కారణంగా అల్పపీడనం పైనే రైతన్నల్లో ఆశలు కనిపిస్తున్నాయి.



దుక్కి దున్ని వరినాట్లకు సిద్ధంగా ఉన్న పొలం

## కాణిపాకంలో వైభవంగా కార్తీక దీపారాధన



కాణిపాకం, అక్టోబర్ 31 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమణికంఠేశ్వరాలయంలో సోమవారం కార్తీక దీపారాధన అత్యంత ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన మాసం. కార్తీకమాసంలో ప్రతి సోమవారం శివాలయాలలో దీపాలను వెలిగించి మహిళలు మొక్కులు తీర్చుకుంటుంటారు. శ్రీమణికంఠేశ్వరాలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టుకింద మహిళలు సోమవారం రోజున ఉదయం నుండి రాత్రి వరకు పెద్దఎత్తున దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాణిపాకం పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్దఎత్తున దీపారాధన కోసం తరలిరావడంతో మణికంఠేశ్వరాలయంలో మహిళా భక్తుల రద్దీ నెలకొంది. ఇదిలా వుండగా ఆలయంలో ఉదయం స్వామి అమ్మవార్లకు ప్రత్యేకఅభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ఉసిరి చెట్టుకింద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

## అర్జీలను సకాలంలో పరిష్కరించండి

-కలెక్టర్ వెంకటరమణారెడ్డి



తిరుపతిరూరల్, అక్టోబర్ 31 ప్రభాతవార్త:

స్పందక కార్యక్రమాన్ని వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 171 అర్జీలు అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

## స్పందనకు 219 అర్జీలు



చిత్తూరు, అక్టోబర్ 31 ప్రభాతవార్త:

ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం కలెక్టర్ హరినారాయణన్ ఆధ్వర్యంలో జరిగే స్పందన కార్యక్రమంకు ఈ వారం జిల్లా నలుమూలల నుండి 219 మంది అర్జీదారులు సమస్యలపై అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. స్పందన కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, ట్రైనీ కలెక్టర్ మేఘస్వరూప్‌లు అర్జీలను పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంకు అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 148 అర్జీలు అధికారులకు అందగా సర్వే ల్యాండ్ సెటిల్‌మెంట్ శాఖ 15, హౌసింగ్ కార్పొరేషన్ 19, పంచాయతీరాజ్ 7, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ 5, సంక్షేమ శాఖలు 4, ఇతర శాఖలకు సంబంధించి 21 అర్జీలు అధికారులకు అందాయి.

## మాజీ మంత్రి నారాయణకు కోర్టు షాక్

### బెయిల్ రద్దు చేస్తూ 9వ అదనపు జిల్లా కోర్టు ఉత్తర్వులు
### నవంబర్ 30వ తేదీలోపు కోర్టు ఎదుట హాజరు కావాలని ఆదేశం

చిత్తూరు, అక్టోబర్ 31 ప్రభాతవార్త:

నారాయణ విద్యా సంస్థల అధినేత, మాజీ మంత్రి నారాయణకు చిత్తూరు జిల్లా కోర్టు షాక్ ఇచ్చింది. టెన్త్ ప్రశ్నాపత్రాల లీకేజీ కేసులో బెయిల్‌పై వున్న మాజీ మంత్రి నారాయణ బెయిల్‌ను 9వ జిల్లా అదనపు కోర్టు సోమవారం రద్దు చేసింది. మాజీ మంత్రి నారాయణ బెయిల్ రద్దు కావడంతో ఆయనను నవంబర్ 30వ తేదీలోపు కోర్టు ఎదుట లొంగిపోవాలని జిల్లా జడ్జి ఆదేశించారు. జిల్లాలో 2022 ఏప్రిల్ నెలలో జరిగిన టెన్త్ పబ్లిక్ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీకేజీ అయ్యాయి. ఈ మేరకు నెల్లేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రం నుండి టెన్త్ ప్రశ్నాపత్రం లీకేజీ అయ్యిందని చిత్తూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ ఫిర్యాదుపై విచారణకు దిగిన పోలీసులు టెన్త్ ప్రశ్నాపత్రాల లీకేజీ పక్కా వ్యూహంతో జరిగిందని తేల్చారు. నెల్లేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో విధులు నిర్వర్తించే ఒక ఇన్విజిలేటర్, మరొక ప్రభుత్వ ఉపాధ్యాయుడితో కలిసి టెన్త్ ప్రశ్నాపత్రంను వాట్సాప్ ద్వారా పరీక్షా కేంద్రం నుండి వెలుపలికి పంపినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు పరీక్షా కేంద్రంలో టెన్త్ ప్రశ్నాపత్రం లీకేజీకి పాల్పడిన ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులను అదుపులోకి తీసుకొన్న పోలీసులు ఉపాధ్యాయుల వాట్సాప్ నుండి ఎవరెవరికి ప్రశ్నాపత్రం వెళ్ళిందనే విషయంపై విచారణ చేపట్టారు. ఈ పోలీసుల విచారణలో తిరుపతి నగర పరిసరాల్లోని పలు కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులకు ఈ ప్రశ్నాపత్రం వెళ్ళిందని పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు తిరుపతి నారాయణ విద్యా సంస్థలతో పాటు ఇతర ప్రైవేటు విద్యా సంస్థల్లో విధులు నిర్వర్తించే ఆరు మంది సిబ్బందిని ఈ కేసులో పోలీసులు అరెస్టు చేశారు. అలాగే ఈ కేసులో నారాయణ విద్యాసంస్థల్లో కీలకమైన నారాయణ పాత్ర వుందని పోలీసులు నిర్ధారించి ఆయనను మే 10వ తేదీ అరెస్టు చేసి అదే రోజు అర్థరాత్రి చిత్తూరు కోర్టు మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. పోలీసుల దర్యాప్తు నివేదికను పరిశీలించిన జడ్జి నారాయణ విద్యా సంస్థల నిర్వాహకులు నారాయణకు బెయిల్ మంజూరు చేశారు. ఈ కేసులో నారాయణ విద్యాసంస్థల నిర్వాహకులు నారాయణకు బెయిల్ మంజూరు కాగా ఇదే కేసులో అరెస్టు అయిన మరో ఎనిమిది మంది నిందితులను రిమాండ్‌కు తరలించారు. టెన్త్ ప్రశ్నాపత్రాల లీకేజీ కేసులో నారాయణ విద్యా సంస్థల నిర్వాహకులు నారాయణకు కింది కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు దీనిని సవాల్ చేస్తూ పై కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఈ పిటీషన్‌పై విచారించిన 9వ అదనపు జిల్లా జడ్జి సోమవారం మాజీ మంత్రి నారాయణ బెయిల్‌ను రద్దు చేస్తూ నవంబర్ 30వ తేదీలోపు మాజీ మంత్రి నారాయణ కోర్టు ఎదుట లొంగిపోవాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## సంయమనంతో రండి !

### సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లుకు సిద్ధం!



తిరుమల,అక్టోబర్ 31ప్రభాతవార్తప్రతినిధి:

వెంకన్న సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్ల జారీకి తిరుపతిలో సర్వం సిద్ధమైంది. ఆఫ్‌లైన్‌లో శ్రీనివాసం, అలిపిరి భూదేవికాంప్లెక్స్, గోవిందరాజస్వామి ఉచితసత్రాలు 2 వద్ద మొత్తం 30 కౌంటర్లులో జారీచేసే 25వేల ఉచిత టోకెన్లను భక్తులు సాఫీగా అందుకోవాలని టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి కోరారు. ఈ టోకెన్లు జారీచేసే కౌంటర్ల వద్ద ఏర్పాట్లు, జారీ చేయాల్సిన విధానంపై జెఇఓ వీరబ్రహ్మం, సిఇ నాగేశ్వరరావు ,విజిఓ మనోహర్‌తో కలసి సూచనలు చేశారు. టోకెన్ పొందిన భక్తులు నెలకు ఒకసారి మాత్రమే ఈ అవకాశం కల్పించుకోవచ్చు.

## నేటి నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీలు నిషేధం

### సంక్షోభంలో వేలాది కుటుంబాలు

కోట, అక్టోబర్ 29 ప్రభాతవార్త

నేటి నుంచి ఫ్లెక్సీలు కనిపించవు. ఫ్లెక్సీ, ప్రిటింగ్ యంత్రాలు పనిచేయవు. ప్రింటిగ్ వినియోగాన్ని పూర్తిగా ఆపే యాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాలను కఠినంగా అమలు చేయక తప్పదని జిల్లా అధి కార యంత్రాగం స్పష్టం చేస్తోంది. ఈ నేపధ్యంలో జిల్లా లోని ఫ్లెక్సీ ప్రిటింగ్, యజమానుల,సాంతికేత సిబ్బంది కార్మికుల పరిస్దితి ఏమిటన్నది ప్రశ్నార్ధ కంగా మారింది. ఉదయం నిద్ర లేచింది మొదలు తిరిగి నిద్రించే వరకు మనకు అవసరమైన చాలా వస్తువులు ప్రస్తుతం ప్లాస్టిక్ సంచుల్లోనే లభ్యమవుతుండటంతో పాటు విక్రయిస్తున్నారు. అధికారిక గణాంకాల ప్రకారం ఒక వ్యక్తి రోజుకు సగటున 31 గ్రాముల ప్లాస్టిక్ వినియోగిస్తున్నాడని, ఇది ఏడాదికి 12 కిలోలుగా ఉంటుందని అంచనా. నగరాలు, గ్రామాల్లో చెత్తతో పాటు ప్లాస్టిక్ వ్యర్థా లను కలిపేసి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారు. వీటిని అలాగే కాల్చేస్తుండటంతో విష రసాయనాలు వెలువడి గాలి, పరిసరాలు కలుషితం అవుతున్నాయి. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం ప్లాస్టిక్ ఫ్లెక్సీల స్థానంలో వస్త్ర బ్యానర్లు ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించింది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.



### అర్హులైన ప్రతి ఒక్కరికి

# ఇల్లు మంజూరు

### రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ఆర్‌కె రోజా



నింద్ర,అక్టోబరు 31 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికి ఉచితంగా ఇల్లు మంజూరు చేస్తున్నారని రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రి ఆర్‌కె రోజా తెలిపారు. శనివారం మండల కేంద్రంలో యస్‌సి,యస్‌టి,బిసి,మైనార్టీలకు,105 మందికి ఇంటిపట్టాలు మంత్రి చేతుల మీదగా అందజేసారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని నమ్మి ఓటువేసిన ప్రతి ఒక్కరికి ఏదో ఒక రూపంలో సహాయం అందజేస్తున్నారని తెలిపారు. ఇచ్చిన వాగ్దనాలలో 98శాతం అమలు చేసిన ఘనత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని తెలిపారు. మండల కేంద్రంలో నేతమ్స్ షుగర్ ప్యాక్టరీ రైతులకు ఇవ్వవల సిన బకాయిలు,కార్మికుల జీతాలు వెంటనే చెల్లించడానికి చర్యలు తీసుకుంటానని తెలి పారు.రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని వైయస్ జగన్ మూడు రాజ ధానులు తీసుకొనివస్తా వుంటే ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు 29 గ్రామాలే రాజధాని అని రియల్‌ఎస్టేట్ వ్యాపారస్థులకు మద్దతు తెలుపుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ సుజన,తహాశీల్దారు అమరేంద్రబాబు, యంపిడిఓ వేణు,హౌసింగ్ డిఇ శంకరప్ప,యంపిపి దీపాజలంధర్‌రాజు,మండల వైకాపా కన్వీనర్ వేణురాజు,నింద్ర గ్రామ సర్పంచ్ వసంత్ బాబురెడ్డి,సింగల్‌విండో చేర్మన్ మునిక్రిష్ణారెడ్డి,రాష్ట్ర వైకాపా యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్,కో ఆప్షన్ మెంబరు అనిల్,డైరెక్టర్ జయశ్రీ,వైస్ యంపిపి శుభారామ్ నాయకులు మేరీజయరామ్, మహేష్, రామచంద్రారెడ్డి,తోయజాక్షి, సంపత్‌కుమార్, బాబురెడ్డి,సుబ్రమణ్యంయాదవ్,సత్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరులో ఘనంగా ఏక్తా దివస్ వేడుకలు

### గాంధీ విగ్రహం నుండి పివికెఎన్ డిగ్రీ కళాశాల వరకు రన్ ఫర్ యూనిటీ

చిత్తూరు, అక్టోబర్ 31 ప్రభాతవార్త:



చిత్తూరు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఏక్తా దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేశ మొదటి ఉప ప్రధాని సర్ధార్ వల్లభాయ్ పటేల్ 147వ జన్మదినోత్సవం పురస్కరించుకొని పోలీసు శాఖ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా రన్ ఫర్ యూనిటీ(ఐక్యతా పరుగు) కార్యక్రమంను చిత్తూరు గాంధీ విగ్రహం నుండి పివికెఎన్ డిగ్రీ కళాశాల వరకు నిర్వహించారు. చిత్తూరు గాంధీ విగ్రహం ఆవరణలో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంను జెండా వూపి ప్రారంభించిన అడ్మిన్ అడిషనల్ ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ పటేల్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని పోలీసులు విధి నిర్వహణలో అంకితం కావాలని పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం సర్ధార్ వల్లభాయ్ పటేల్ ఉప ప్రధాని అయ్యారన్నారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందిలో ఐక్యతా భావం పెంపొందేలా పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజ లతో ప్రతిజ్ఞ చేయించారు. రన్ ఫర్ యూనిటీలో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఆపరేషన్స్ ఎఎస్పీ డాక్టర్ కెవి శ్రీనివాసరావు, ట్రాఫిక్ డిఎస్పీ జె.తిప్పేస్వామి, ఎస్‌బి డిఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఏఆర్ డిఎస్పీ లక్ష్మీ నారాయణరెడ్డి, ఆర్ఐలు నీలకంఠేశ్వరరెడ్డి, మధులు, చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ నరసింహరాజు, టుటౌన్ ఇన్స్‌పెక్టర్ యతీంద్ర, వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులురెడ్డి, నగర పరిధిలోని ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు అధికారుల సంఘ అధ్యక్షుడు ఉదయకుమార్, విశ్రాంత పోలీసు ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే నెలలో 66కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

– మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్



కుప్పం, అక్టోబర్ 31 ప్రభాతవార్త

సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కుప్పం మున్సిపాలిటీకి కేటాయించిన 66 కోట్ల నిధులకు సంబంధించి అభివృద్ధి పనులకు నవంబర్ 2,3తేదీల్లో టెండర్లు ఖరారవుతాయని త్వరలోనే అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఛైర్మన్ మాట్లాడారు. కుప్పం మున్సిపల్ పరిధిలో గృహ బకాయిలు 4.39కోట్లు, నీటి పన్ను 85లక్షల దాకా ఉందన్నారు. పన్నుల వసూళ్లకు సంబంధిత కౌన్సిలర్లు సహకరించాలని కోరారు. నవంబర్ లోగా పన్నులు చెల్లించేవారికి ఎలాంటి జరిమానా విధించేది లేదన్నారు. మున్సిపల్ పరిధిలో అక్రమ నీటి కనెక్షన్లు సైతం ఉన్నాయన్నారు. కుప్పంలో రూర్బన్ నిధులతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ గదులకు కొత్తగా టెండర్లు పిలవడం జరుగుతుందని 1లక్ష డిపాజిట్, 10వేల అద్దె నిర్ణయించనున్నట్లు తెలిపారు. కాగా సమావేశం నుంచి మున్సిపల్ వైస్ ఛైర్మన్ మునస్వామి బాయ్‌కాట్ చేసి వెళ్లిపోయారు. మున్సిపాలిటీ పరిధిలో చిన్న చిన్న పనులకు సంబంధించి కూడా బిల్లులు చెల్లించక అధికారులు ప్రతిదానికీ ఆన్‌లైన్ అంటూ పేర్కొనడం తగదని పేర్కొన్నారు. ప్రజలు సమస్యలపై తమను నిలదీస్తారని మున్సిపల్ సిబ్బంది రాకుంటే తామే స్వయంగా కాలువలు శుభ్రం చేయడం, పైపులు బిగించడం జరుగుతోందన్నారు. అనంతరం ఛైర్మన్ మాట్లాడుతూ ఇరవై వేల లోపుఉన్నబిల్లులనుతక్షణంచెల్లించాలనికమీషనర్‌రవిరెడ్డినిఆదేశించారు.కోఆప్షన్‌సర్దార్ మాట్లాడుతూమోడల్ కాలనీ ప్రాంతంలో క్రమం తప్పక నీటిని సరఫరా చేయాలని పట్టుబట్టారు. ఈ సమావేశంలో మున్సిపల్‌వైస్‌ఛైర్మన్ మునస్వామి, కమీషనర్ రవిరెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## అనాథ కుటుంబానికి ఆర్థికసాయం

కుప్పం, అక్టోబర్ 31 ప్రభాతవార్త



కుప్పం కొత్తపేట ప్రాంతంలో తల్లిదండ్రులను కోల్పోయిన అనాథకుటుంబానికిఅనుకోనిఅతిథులుమేం బృందం సభ్యులు ఇరవైవేలరూపాయలఆర్థికసాయాన్నిఅందించారు. అదేవిధంగా నెలరోజులకు సరిపడా నిత్యావసర సరుకులను ఆ కుటుంబానికి అందించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు.

## విజలాపురం పిహెచ్‌సి అదనపు డాక్టర్ నియామకం

రామకుప్పం, అక్టోబర్ 31 ప్రభాతవార్త



మండలంలోని విజలాపురం పిహెచ్‌సి అదనపు వైద్యాధికారిగా డా॥ సాదియా జఫ్రీన్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ వైద్యాధికారిగా అల్తాఫ్ హుసేన్ కొనసాగుతున్నారు. వైద్య సేవల విస్తృత ంలో భాగంగా ప్రభుత్వం అదనపు డాక్టరుగా సాదియాను నియమించింది.

## నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

కాణిపాకం, అక్టోబర్ 31 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు సోమవారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ మేరకు పెద్దపంజాణికి చెందిన రాజేంద్రప్రసాద్ అనే భక్తుడు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్‌కు అందజేశారు.

## ఐదు దశాబ్దాల వ్యథకు మంత్రిచే వెలుగులు

–ద్వారకనాథరెడ్డి



పుంగనూరు, అక్టోబరు 31 ప్రభాతవార్త :

రవాణాతో పాటూ ఎటువంటి కనీస సదుపాయాలు లేకుండా ఐదు దశాబ్దాలపాటూ కునారిల్లిపోయిన నియోజకవర్గ కేంద్రమైన పుంగనూరుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెలుగులు తీసుకువస్తున్నారని తంబళ్లపల్లి ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి అన్నారు. సోమవారం ఆయన స్థానిక ఆర్టీసి బస్టాండులో బోయకొండతో పాటూ ఎల్లారుబైలు,కాటిపేరిలకు నూతన ఆర్టీసి సర్వీసులు ప్రారంభించారు.ఆర్టీసి మజ్దూర్‌యూనియన్ ఛైర్మన్ ఎన్.జయరామిరెడ్డి,మేనేజర్ సుధాకరయ్యల సమక్షంలో ఆయన నూతన సర్వీసులను ప్రారంభించారు. రాష్ట్రజానపదకళల అకాడమీ ఛైర్మన్ కొండవీటి,పిఎంకే ఉడా ఛైర్మన్ వెంకటరెడ్డియాదవ్,ఎంపిపి అక్కిసానిభాస్కరరెడ్డి,ఛైర్మన్ అలీ ం,ఏఎంసిసి నాగరాజరెడ్డిలతో పాటూ అనేక మంది నాయకులు,అధికారులు పాల్గొన్న ఈకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇది ప్రారంభం మాత్రమేనని,రెండేళ్లలో మరింత అభివృద్ధిని మంత్రి అందిస్తారన్నారు.

## జడ్పీ ఛైర్మన్‌ను కలిసిన పెనుమూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్

చిత్తూరు, అక్టోబర్ 31 ప్రభాతవార్త:



జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులును ఆయన ఛాంబర్‌లో సోమవారం పెనుమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన బండి కమలాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నవంబర్ 4వ తేదీ జరిగే మార్కెట్ కమిటీ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి కమిటీ ఛైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి జడ్పీ ఛైర్మన్‌ను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సాతంబాకం ఎంపిడిఓ యశోదారెడ్డి, వైకాపా నాయకులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రహదారి పునర్‌నిర్మాణానికి చర్యలు

– జడ్పీ ఛైర్మన్‌ను కలిసిన సప్తకన్నికల దేవస్థానం కమిటీ సభ్యులు



చిత్తూరు, అక్టోబర్ 31 ప్రభాతవార్త:

గుడిపాల మండలం కోటూరు గ్రామ పంచాయతీకి చెందిన సప్తకన్నికల దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం జడ్పీ ఛైర్మన్ ఛాంబర్‌లో ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఛైర్మన్‌తో మాట్లాడుతూ గట్రాళ్ళమిట్ట మీదుగా చెరువు కట్ట వరకు వున్న రహదారిని పునర్‌నిర్మించాలని కోరారు. దీనిపై స్పందించిన జడ్పీ ఛైర్మన్ ఈ విషయంను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకొంటామని కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సప్తకన్నికల దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## స్పందన వినతులకు సకాలంలో పరిష్కారం

– కమిషనర్ డాక్టర్ జె.అరుణ



చిత్తూరు, అక్టోబర్ 31 ప్రభాతవార్త:

స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. నగరపాలక కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో కమీషనర్ డాక్టర్ జె.అరుణ పాల్గొని ప్రజల నుండి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను సత్వరం క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలన్నారు. సోమవారం కమీషనర్ నిర్వహించిన స్పందన కార్యక్రమంలో నగర ప్రజల నుండి 9 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ గోవర్ధన్, ఎంహెచ్ఓ డాక్టర్ అనిల్‌కుమార్, ఎంఇ ధనలక్ష్మీ, డిఇలు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, ఎఇలు, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రచారం

బంగారుపాళ్యం, అక్టోబర్ 31 ప్రభాతవార్త:



రాయలసీమ తూర్పు పట్టభద్రుల శాసన మండలి ఓటరు నమోదుపై సోమవారం బంగారుపాళ్యంలో ప్రచారం నిర్వహించారు. వైఎస్ ఆర్‌సిపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మద్దతుగా మాజీ జడ్పీ ఛైర్మన్ కుమార్‌రాజా నమోదు ప్రక్రియ చేపట్టారు. పంచాయతీ పరిధిలో పట్టభద్రులైన ఓటర్ల వద్దకు వెళ్ళి ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉమాదేవి, జడ్పీటీసీ సోమశేఖర్, ఉప సర్పంచ్ కామరాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు దత్తాత్రేయరెడ్డి, వైకాపా నాయకులు జగదీష్, కృష్ణమూర్తి, కిషోర్‌కుమార్‌రెడ్డి, దామోదరం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వల్లభాయ్ పటేల్ జయంతి

బంగారుపాళ్యం, అక్టోబర్ 31 ప్రభాతవార్త:



స్థానిక గ్రామ సచివాలయ కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. మాజీ జడ్పీ ఛైర్మన్ కుమార్ రాజా వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించి సమైక్య భారతదేశం కోసం పటేల్ కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సోమశేఖర్, సింగిల్‌విండో ఛైర్మన్ దత్తాత్రేయరెడ్డి, సర్పంచ్ ఉమాదేవి, ఉప సర్పంచ్ కామరాజు, పంచాయతీ సెక్రటరీ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## పటేల్ అడుగు జాడల్లో ముందడుగు

గుడిపాల, అక్టోబర్ 31 ప్రభాతవార్త:

ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అడుగు జాడల్లో నడచి దేశంను మరింత సుస్థిరంగా అభివృద్ధి చేయాలని ఎంపిపి ప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకొని సోమవారం జడ్పీ ఉన్నత పాఠశాల, సిఎన్ఆర్ కళాశాల విద్యార్థులు నిర్వహించిన ర్యాలీని ఎంపిపి ప్రసాదరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంను ఐక్యంగా చేసిన ఉక్కు మనిషి పటేల్‌అని ఆయన జన్మదినం పురస్కరించుకొని ఏక్తా దివస్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓఉపేంద్ర,జడ్పీ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ సబర్మతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం



## హత్యాయత్నం కేసులో ఏడేళ్ళు జైలు

చిత్తూరు, అక్టోబర్ 31 ప్రభాతవార్త:

యాదమరి మండలం మాదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సురేష్(36)కు హత్యాయత్నం కేసులో ఏడేళ్ళు జైలు శిక్ష విధిస్తూ సోమవారం కోర్టు తీర్పు వెలువరిం చింది. 2017 సంవత్సరంలో మాదిరెడ్డిపల్లి గ్రామంకు చెందిన సురేష్ అదే గ్రామంకు చెందిన సుధాకర్‌తో ఘర్షణకు దిగి హత్యాయత్నంకు ప్రయత్నించాడు. ఈ ఘర్షణలో సుధాకర్‌కు తీవ్ర గాయాలు కావడంతో అతని తమ్ముడు ఏకాంబరం యాదమరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై యాదమరి పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు సురేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును విచారించిన జడ్జి శ్రీనివాసమూర్తి సాక్షులను విచారించి నిందితుడు హత్యాయత్నంకు ప్రయత్నించాడని నిర్ధారించారు. దీనిపై సోమవారం జడ్జి శ్రీనివాసమూర్తి నిందితుడు సురేష్‌కు ఏడేళ్ళు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా చేసిన ఎసిపిశైలజ,సర్కిల్‌ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ సుమన్‌లను డిఎస్పీ సుధాకర్‌రెడ్డి అభినందించారు.

## ప్రజా సమస్యల పరిష్కారంకే గడప గడపకు - ఎమ్మెల్సీ భరత్

కుప్పంరూరల్, అక్టోబర్ 31 ప్రభాతవార్త



ప్రజా సమస్యల పరిష్కారంకే గడప గడపకు మీ ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. సోమవారం మిట్టపల్లి పంచాయతీలో గడపగడపకు మీ ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిఇంటివద్దకువెళ్లి సంక్షేమ పథకాలు అందుతు న్నాయా లేదాఅనిఅడిగితెలుసుకున్నారు.అర్హులైనప్రతి ఒక్కరికీ నవరత్నాలు పథకాల్లో తప్పక లబ్ది కలిగిస్తామన్నారు. మూడేళ్లపాలనలోసిఎంజగనన్న కుప్పం ప్రజలకు 1143కోట్లు వివిధ పథకాల రూపంలోఅందించారన్నారు. గాంధీజీకలలుగన్న గ్రామస్వరాజ్యం సాధనలో భాగంగా సచివాలయ వ్యవస్థ అందుబాటులో తెచ్చి ప్రజల ముంగిటకే పాలన తెచ్చారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, జడ్పీటిసి ఎడిఎస్ శరవణ, రాష్ట్ర వన్నియకుల క్షత్రియ కార్పోరేషన్ ఛైర్మన్ వనిత శ్రీను, వైస్ ఎంపిపి షౌకత్ అలీ, టెలికాం బోర్డు సభ్యుడు వెంకటేష్, కో ఆప్షన్ అతహర్, వివిధ శాఖల అధికారులు, నేతలు పాలొన్నారు.

## కాణిపాక ఆలయం దళారీల గుప్పిట్లోకి..

చిత్తూరురూరల్, అక్టోబరు 31 ప్రభాతవార్త:

దళారీల గుప్పెట్లోకి కాణిపాక వరసిద్ది వినాయకస్వామి వెళ్లిపోయిందని, అక్రమాలకు రాజకీయ పైరవీలకు ఆధిపత్యపోరుకు నిలయమైందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ఆరోపించారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆలయంలో ఇటీవల బంగారు విభూదిపట్టి మాయమైందని, కేవలం ఒక అర్చకుని మాత్రమే సస్పెండ్‌చేసి మిగతా ఉద్యోగస్తులకు కేవలం షోకాజ్ నోటీసులతో సరిపెట్టారన్నారు. అలాగే ఇటీవల ఆలయంలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి తిరుమల కొండపైన టిక్కెట్లు అమ్ముతూ పోలీసులకు దొరికితే ఉద్యోగికి సహకరించి లెటర్లు ఇచ్చిన ఏఈవో స్థాయి అధికారిని సస్పెండ్ చేయకుండా కేవలం ఒక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని మాత్రం సస్పెండ్ చేసారన్నారు. ఆలయంలో నకిలీ విద్యార్హత పత్రాలతో ఉద్యోగంలో చేరి ప్రమోషన్లు పొందిన ఉద్యోగస్తులను సైతం సిబిసిఐడి చేత విచారణ జరిపించాలని పేర్కొన్నారు. s ఈ కార్యక్రమంలో పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, తెలుగుదేశం మహిళా అధ్యక్షురాలు అరుణ, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేష్‌యాదవ్, పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి దుర్గాచౌదరీ, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభుతేజ తదితరులు పాలొన్నారు.

## బదిలీల షెడ్యూల్ వెంటనే ప్రకటించాలి

చిత్తూరురూరల్, అక్టోబరు 31 ప్రభాతవార్త:

ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న బదిలీల షెడ్యూల్ వెంటనే ప్రకటించాలని స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నరోత్తమరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుబ్బారావులు ఒక ప్రకటనలో డిమాండ్ చేసారు. పేసియల్ అటెండెన్స్ యాప్ సర్వర్ సామర్థ్యాన్ని పెంచాలని, అటెండెన్స్ నమోదుకాక ఉపాధ్యాయులు ఎంతో మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. ఎంఇవో2 పోస్టులను రద్దు చేయకుండా ఉమ్మడిసీనియార్టీప్రకారంస్కూల్‌అసిస్టెంట్లకుపదోన్నతులుకల్పించాలని,వెంటనే సిపిఎస్‌ను రద్దుచేయాలన్నారు.అలాగేపిఆర్‌సి,డిఏఅరియర్స్, పిఎఫ్,రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేసారు.

## ఘనంగా రాష్ట్రీయ ఏక్తావిదాస్ వేడుకలు

చిత్తూరురూరల్, అక్టోబరు 31 ప్రభాతవార్త:

పట్టణంలోని ఎన్‌పి సావిత్రమ్మ మహిళా కళాశాల నందు సర్దార్‌వల్లభాయ్ పటేల్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం రాష్ట్రీయ ఏక్తాదివాస్ వేడుకలను చరిత్ర శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.కళాశాలప్రిన్సిపాల్‌డా.మనోహర్‌భారతదేశఉక్కుమనిషిసర్దార్‌వల్లభాయ్‌పటేల్ సమైక్యభావాలు, సేవలగురించివిద్యార్థులకువివరించారు.సీనియర్‌అధ్యాపకులుడా.షమ్స్‌అక్తర్,పురుషోత్తంనాయుడు, ఆనంద్,ఎన్ఎస్ఎస్ ఆఫీసరు డా.ఎం.రుక్మిణి, కళాశాల అధ్యాపకులు, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటాం : ఏవో

కోట, అక్టోబర్ 31 ప్రభాతవార్త

రబీ సీజన్‌లో రైతులకు సాగులో కష్టాలు లేకుండా అన్ని విధాలుగా ఆదుకుంటామని మండల వ్యవసాయశాఖ అధికారి నిరంజన్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన కోటలో విలేఖరులతో మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులకు ఏ కష్టం లేకుండా చూస్తామన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు రైతు భరోసా కేంద్రాలలో తమ ఉద్యోగులు అందుబాటులో ఉంటున్నారని, ఏ ఇబ్బంది వచ్చినా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. విత్తనాలు, ఎరువులకు ఇబ్బంది రాకుండా అందుబాటులో ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇప్పటికే కోట మండలంలో 9 వేల ఎకరాలకు పైగా రబీ సాగులో చేయాల్సి ఉండగా, 7వేల ఎకరాలకు పైగా వరినాట్లు వేయడం జరిగిందన్నారు. ఎన్ఎల్ఆర్ 34449, ఆర్ఎన్ఆర్ 15048 విత్తనాలను కూడా అందజేస్తామన్నారు. రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ఏ విత్తనాలు అవసరమో చెప్తే ముందుగా రైతులకు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉంటామని ఆయన తెలిపారు.

## వాడవాడలా శివయ్యకు పూజలు

కోట, అక్టోబర్ 31 ప్రభాతవార్త

కార్తీకమాసంసందర్భంగాకోటమండలంలోనిఆలయాలుముస్తాబయ్యాయి. గూడలిలోని సంగమేశ్వరస్వామి, భీమేశ్వరస్వామి, కోటలోని శివాలయం, పుచ్చలపల్లిలో శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో తొలి సోమవారం కావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

## ఘనంగా సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి వేడుకలు

సూళ్లూరుపేట, అక్టోబర్ 31 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీహరికోట ఐల్యాండ్ లూజర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాజీ హోమ్‌మినిస్టర్ ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు నిర్వహించారు. దేశ అభ్యున్నతి కోసం పటేల్ చేపట్టిన సంస్కరణలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో బైరి పార్థసారధిరెడ్డి, మల్లి శ్రీనివాసులు, అమాస జర్రారెడ్డి, రమేష్‌రెడ్డి, దశరధరాజు, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చేనిగుంట వద్ద మోటారు, సామగ్రి అపహరణ

తడ, అక్టోబర్ 31 ప్రభాతవార్త

తడ మండలం చేనిగుంట సమీపంలోని ఒక లేఅవుట్‌లో విద్యుత్ మోటారుతో పాటు ఇనుప సామగ్రి అపహరణకు గురైనట్లు తడ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్ఐ జె.పి.శ్రీనివాసరెడ్డి కథనం మేరకు చేనిగుంటకు చెందిన పి.సుబ్రహ్మణ్యంరెడ్డి ఇచ్చిన ఫిర్యాదులో ఒక లక్షా 5వేల రూపాయలు విలువైన ట్రాక్టర్ సెంట్రింగ్ ఇనుము కటింగ్ సామగ్రితో పాటు ఒక విద్యుత్ మోటారు అపహరణకు గురైనట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. నూతనంగా ఏర్పాటవుతున్న ఒక లేఅవుట్‌లో వాటర్‌ట్యాంకు నిర్మాణం కోసం వీటిని అక్కడే విడిచి వచ్చిన తర్వాత అపహరణకు గురైనట్లు పేర్కొన్నారు.

**మోటార్‌సైకిల్ దొంగతనంపై ఫిర్యాదు** ..తడలోని భారత్ పెట్రోలియం బంకు ఎదురుగా తన మోటార్‌సైకిల్ అపహరణకు గురైనట్లు తమిళనాడుకు చెందిన వి.సంతోష్ అనే యువకుడు తడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తిరువళ్లూరు జిల్లా కొలంబేడుకు చెందిన సంతోష్ సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమ్మ ఆలయానికి వెళ్లి తిరిగి వస్తూ టిఫిన్ చేసేందుకు తడ వద్ద ఆగి మోటార్‌సైకిల్‌ను పెట్రోల్ బంకు సమీపంలో ఉంచారని, అయితే టిఫిన్ చేసిన తర్వాత తిరిగి వచ్చేసరికి అపహరణకు గురైనట్లు బాధితుడు ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు.

## కరాటేలో సత్తా చాటిన ప్రగతి విద్యార్థులు

కోట,అక్టోబరు 31 ప్రభాతవార్త



కోటలోని శ్రీప్రగతి విద్యానికేతన్ స్కూల్‌లో విద్యార్థులు కరాటేలో చక్కని ప్రతిభ చాటారు. ఆమేరకు కరాటేలో సత్తా చాటిని విద్యార్థులను సోమవారం స్కూల్‌లో ఛైర్మెన్ పసుపులేటి కిషోర్ అభినిందించారు. హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో జరిగిన బెల్ట్‌గ్రేడింగ్ పరీక్షల్లో బ్లాక్ బెల్ట్ పొంది ఈ విద్యార్థులు శేభాష్ అని పించారు. 7వతరగతి చదువుతున్న వైష్ణవి, 9వ తరగతి చదువుతున్న అభిరామ్‌లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బ్లాక్ బెల్ట్ పొందారు. కరాటే మాస్టర్ హరి బాబు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బాలికలు కరాటేలో శిక్షణ పొందాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకే తమ పాఠశాలలో కరాటేలో నైపుణ్యంతో కూడిన శిక్షణ ఇసున్నామని ఆయన పేర్కొన్నారు.గత 10 సంవత్సరాల నుంచి కరాటేలో శిక్షణ తరగతులను ఇస్తున్నామన్నారు.

## సూళ్లూరుపేట మున్సిపల్ సర్వసభ్య సమావేశం

సూళ్లూరుపేట, అక్టోబర్ 31 ప్రభాతవార్త



సూళ్లూరుపేట మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం సోమవారం స్థానిక స్త్రీశక్తి భవన్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఛైర్‌పర్సన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించి అజెండాలో పొందుపరిచిన అంశాలను ఆమోదించారు. పట్టణ పరిధిలోని రోడ్లు, డ్రైనేజిలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వాటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామని ఛైర్‌పర్సన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి తెలిపారు. అలాగే ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఎక్కడా పారిశుధ్యానికి లోటు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. మంచినీటి సరఫరాను మెరుగుపరిచి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతిన చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నాగిశెట్టి నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో భారీ వర్షం

సూళ్లూరుపేట, అక్టోబర్ 31 ప్రభాతవార్త

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో సూళ్లూరుపేట పట్టణంతో పాటు మండల పరిధిలోనూ సోమవారం నుంచి భారీ వర్షాలు కురవడం ప్రారంభమయ్యాయి. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అతి భారీవర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని ప్రకటించడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అప్రమత్తం అయ్యారు. ముఖ్యంగా సూళ్లూరుపేట నియోజకవర్గం భారీవర్షాలకు గురవుతుందని సమాచారం ఉండటంతో ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. ఒకవైపు భారీ వర్షం కురుస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నిరోజులుగా వర్షం లేక ఇబ్బందులు పడుతున్న రైతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో తాము పంటలు పండించుకోవచ్చుని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## తడ శివాలయాల్లో కార్తీక సోమవారం పూజలు

తడ, అక్టోబర్ 31 ప్రభాతవార్త



తడ మండలంలోని పలు శివాలయాల్లో సోమవారం కార్తీక మాసం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివునికి ఎంతో ఇష్ట మైన కార్తీక మాసంలో వచ్చే మొదటి సోమవారం కావడంతో భక్తులు ఆలయాలకు తరలివెళ్లి స్వామివారి అభిషేకాల్లో పాల్గొన్నారు. మండల పరిధిలోని వాటంబేడులో ఉన్న విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వర ఆలయం, మాంబట్టు అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర ఆలయం, బోడిలింగాల పాడులోని భువనేశ్వరి సమేత భువనేశ్వరాలయాలతో పాటు అందగుండల మార్గంలో ఉన్న పాటిమిట్ట శివాలయం, వేనాడులోని శ్రీశృంగేశ్వర ఆలయాల్లో ఉదయంనుంచేఅభిషేకాలు,అమ్మణ్ణికిఅలంకారాలు చేశారు. సాయంత్రం మహిళలు దీపాలు వెలిగించారు.

## నాయుడుపేటలో వర్షం

నాయుడుపేట రూరల్ అక్టోబరు 31 ప్రభాతవార్త

నాయుడుపేట మడలంలోని పలుగ్రామాల్లో సోమవారం ఒకమోస్తారు వర్షం కురిసింది.ఈవర్షం కురవడంతో రైతులు ఆనంధం వ్యక్తం చేస్తున్నారు.బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో నాయుడుపేట మండలంలో వర్షం పడుతుంది. ఈవర్షంతో ఎల్దిపైరు సాగుచేపట్టిన రైతులకు కొంతవరకు ఊరటనిస్తుంది.గతపది రోజుల నుండి భానుడు భగభగ మంటూ మండుతూ తనప్రతాపం చూపడంతో ఎండుముఖం పడుతున్న ఎల్దిపైరుకు వర్షం రావడంతో పచ్చదనం సంతరించుకుంటుంది.గ్రామాల్లో నారుమళ్ళు పోసివున్న రైతులు కురుస్తున్న వర్షాలకు వరినాట్లు వేసేందుకు పంటపొలాలను సర్వంసిద్ధం చేస్తున్నారు.

## కోటలో వర్షం రోడ్లున్నీ జలమయం

కోట,అక్టోబరు 31 ప్రభాతవార్త

కోట మండలంలోని విద్యానగర్, చిట్టేడు, కేశవరం, రామాపురం,రాఘవపురం, గూడలి, చంద్రశేఖపురం, తిన్నెలపూడి, కొత్తపాళెం, జరుగుమల్లి, తదితర ప్రాంతాల్లో వర్షం కురవడంతో పలు ప్రాంతాల్లోని రోడ్లు జలమయంగా మారాయి. దీంతో రోడ్లుపైన ద్విచక్ర వాహనదారులు వేళ్లంటేనే భయపడ్డారు. రోడ్డు పై ఎక్కడ గుంతు తెలియక ఇబ్బందులు పడ్డారు. స్థానిక సెల్‌బ్రేషన్ సెంటర్ నుంచి ఆర్ అండ్ బి రోడ్డు లో పలు గుంతలు పడి ఉన్నాయి. అదే విధంగా దివంగతనేత నల్లపరెడ్డి గోపాల్ రెడ్డి విగ్రహం వద్ద కూడ భారీ స్థాయిలో గుంతలు ఉండటంతో ప్రజలు ఆ ప్రాంతంలో నడవలేక ఇబ్బందులు పడుతున్నారు. కనీసం చిన్న గుంతలైనా పూడ్చలేని స్థితిలో ప్రభుత్వం ఉందానాని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.అదే విద్యానగర్,, గూడలిరోడ్డు పరమ అద్వాన్నంగా ఉంది ఇక్కడ కూడా అధికారులు ,ప్రజా ప్రతినిధులు సైతం నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని ప్రజలు గుర్తు చేస్తున్నారు.ఇక కోట ప్రభుత్వ ఆసుపత్రి వేళ్లి రోడ్డు అయితే పెద్ద పెద్ద గుంతలు పడి ఉన్నాయి. ఆసుపత్రికి వైద్యం కొరకు వచ్చి రోగులు ఎక్కడ గుంతలల్లో పడి గాయాలు అయుతయోనాని ఆందోళన చెందుతున్నారు. కనీసం అధికారులు ఆసుపత్రి ప్రాంగణంలో గ్రావేల్ అయినా తొలి గుంతలును పూడ్చలాని ప్రజలు కోరుతున్నారు.

## నేడే సర్వసభ్య సమావేశం

వాకాడు, అక్టోబర్ 31, ప్రభాతవార్త

వాకాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని మంగళవారం సర్వసభ సమావేశం జరుగుతుందని సోమవారం ఎంపిడిఓ గోపినాథ్ తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిపి అనసూయమ్మ అధ్యక్షతన జరుగుతుందని మండలంలోని మండల స్థాయి అధికారులు, జడ్పిటిసి, ఎంపిటిసి సభ్యులతో పాటు సర్పంచులు పాల్గొంటారని ఈ సమావేశంలో మండలంలోని జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరుగుతుందని ఎంపిడిఓ తెలిపారు.

## సర్దార్ పటేల్ అచివ్‌మెంట్ అవార్డు అందుకున్న ఉపాధ్యాయులు

పెద్దపంజాణి అక్టోబర్ 31 ప్రభాతవార్త :

దేశ మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా వల్లభాయ్ పటేల్ అచివ్‌మెంట్ అవార్డును మండలంలోని నాగిరెడ్డిపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ద్రానోపాధ్యాయులుఉపాధ్యాయులు బాబురెడ్డి,కూరగాయల కొత్తవీరపల్లి పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేష్‌లు అందుకున్నారు.వే ఫౌండేషన్ అంతర్జాతీయ సంస్థ 2022వ సంవత్సరానికిగాను ఈ అవార్డుకోసం బాబూరెడ్డి,వెంకటేష్‌లను ఎంపిక చేసారు ఏక్తా దినోత్సవంలో భాగంగా సోమవారం శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రి కళాశాలలో జాతీయ సమఖ్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యా య రంగంలో బాబూరెడ్డి,వెంకటేష్‌లు చేసిన సేవలకు గుర్తింపుగా అవార్డుతో పాటు ప్రసంశా పత్రం జ్ఞాపికను అందజేశారు. వీరికి అవార్డు రావడంపట్ల ఉపాధ్యాయులు పలువురు అభినందించారు.

## పౌరహక్కులపై అవగాహన అవసరం: తహశీల్దార్

పెద్దపంజాణి అక్టోబర్ 31 ప్రభాతవార్త :

పౌరహక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని తహశీల్దార్ హనుమంతు నాయక్ పేర్కొన్నారు. సోమవారంకోగిలేరు సచివాలయంలో పౌరహక్కుల దినోత్సవంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం పౌరహక్కుల గురించి వివరించి పౌరహక్కులకు భంగం కలిగితేసంబంధితఅధికారులకుఫిర్యాదుచేయాలనిసూచించారు.ఈకార్యక్రమంలోసర్పంచ్ రమేష్,పంచాయతీ కార్యదర్శి గణపతి,వీఆర్వో సుధాకర్,సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## బోయలను ఎస్టీలలో చేర్చద్దు...జిఓ రద్దుచేయండి

పుంగనూరు, అక్టోబరు 31 ప్రభాతవార్త :



బోయలను ఎస్టీలలో చేర్చేందుకు ప్రభుత్వం నియమించిన కమిటీను,జివోలను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ నియోజకవర్గ ఎస్టీసంఘాల నాయకులు సోమవారం పట్టణంలో ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా గిరిజన సంక్షేమ సంఘ నాయకులు బాణావత్ మునేంద్ర, బుక్యానాగేంద్ర,భానుప్రసాద్‌లు మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షలకుపైగా గిరిజనులు ఆర్థికస్వావలంబన కోసం తీవ్రంగాశ్రమిస్తున్నారన్నారు. అయితే,బిసిఏలో ఉన్న బోయలను ఇతర కులాలను ఎస్టీలలో చేర్చేందుకు నియమించబడిన ఏకసభ్యకమీషన్‌ను వెంటనే రద్దుచేయాలని డిమాండ్‌చేస్తూ ఈమేరకు నివేదనను తహసీల్దార్‌కు అందచేశారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పుంగనూరు క్రీడాకారులు జాతీయస్థాయికి ఎదగాలి

–విశ్రాంత డిఎస్పీ సుకుమార్‌బాబు

పుంగనూరు, అక్టోబరు 31 ప్రభాతవార్త :



పాఠశాల స్థాయి నుంచి ఆటల పోటీలలో పాల్గొని విద్యార్థులు ఎదిగి జాతీయస్థాయికి చేరుకోవాలని తద్వారా పుంగనూరు ప్రతిభను ఇనుమడింపచేయాలని విశ్రాంత డిఎస్పీ,జాతీయ మాజీ వాలీబాల్ ఆటగాడు కనుమకుంట సుకుమార్‌బాబు సూచించారు. సోమవారం శుభారాం డిగ్రీకళాశాల ఆవరణలో జరిగిన నియోజకవర్గస్థాయి అథ్లెట్ పోటీల నుంచి ఆటగాళ్ళ ఎంపిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా రిలేపరుగులు, హైజంప్, లాంగ్‌జంప్‌లతో పాటూ పలు ఆటలలో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారిని ఎంపిక చేసి వారిని నియోజకవర్గజట్టుగాప్రకటించారు.ఈజట్టుఆటగాళ్ళురాబోయే రాష్ట్రస్థాయి పోటీలలో ప్రాతినిథ్యం వహిస్తారన్నారు.

## పుంగనూరులో పట్టుబడిన మదనపల్లి రేషన్‌బియ్యం

పుంగనూరు, అక్టోబరు 31 ప్రభాతవార్త :



మదనపల్లి నుంచి పుంగనూరు మీదుగా కర్నాటకకు అక్రమంగా తరలిస్తున్న లారీలోడు రేషన్‌బియ్యాన్ని సిఐ గంగిరెడ్డి సారథ్యంలో స్వాధీనం చేసుకున్నారు. వివరాలల లోనికి వెడితే మదనపల్లి ప్రాంతం నుంచి యధావిధిగా పుంగనూరు పత్రపల్లిమీదుగా కర్నాటకకు బియ్యం తరలించే లారీ ఒకటి అనుమానాస్పద పరిస్థితిలో కనుపించడంతో పోలీసులు వెంబడించారు.అయితేఈక్రమంలోలారీ అదుపుతప్పి ఒకవైపునకు ఒరిగిపోవడంతో లారీ డ్రైవర్,క్లీనర్ పరారయ్యారు. అక్కడికి చేరుకున్న పోలీసులు లారీలో ఉన్న రేషన్‌బియ్యాన్ని గుర్తించి సీజ్‌చేశారు. వివరాలు తెలియరావాల్సి ఉంది.

# ఇద్దరికి వైఎస్ఆర్ వైఎస్ఆర్ లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డులు


డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి


కట్టమంచి బాలకృష్ణారెడ్డి

చిత్తూరు, అక్టోబర్ 31 ప్రభాతవార్త: జిల్లా నుండి వైద్య, వ్యవసాయ రంగాల్లో విశేష సేవలు అందించిన అపోలో గ్రూప్ సంస్థల ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి, వ్యవసాయ రంగంలో ముఖ్యంగా మామిడి పల్ప్ పరిశ్రమల అభివృద్ధికి పాటు పడిన కట్టమంచి బాలకృష్ణారెడ్డిలకు వైఎస్ఆర్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు దక్కాయి. విజయవాడలో మంగళవారం జరిగే కార్యక్రమంలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా వీరు వైఎస్ఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు అందుకోనున్నారు. విభిన్న రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారి సేవలను గుర్తించి వారికి వైఎస్ఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్, అచీవ్‌మెంట్ అవార్డులు ఇవ్వాలని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్ణయించారు. ఈ అవార్డులు పొందిన వారిని మంగళవారం సన్మానించడంతో పాటు ప్రసంశాపత్రం అందజేయనున్నారు. అలాగే వైఎస్ఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీతకు రూ.10 లక్షలు, వైఎస్ఆర్ అచీవ్‌మెంట్ అవార్డుకు రూ.5 లక్షలను ప్రభుత్వం బహుకరించనుంది. జిల్లాలోని అరగొంగ గ్రామంలో జన్మించి దేశ, విదేశాల్లో అపోలో గ్రూప్ సంస్థలను ప్రారంభించి వైద్య రంగంలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డికి వైఎస్ఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు వరించింది. అలాగే వ్యవసాయరంగం, మామిడి పంటల సాగులో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన కట్టమంచి బాలకృష్ణారెడ్డి వైఎస్ఆర్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకోనున్నారు.

**- నేడు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా బహుకరణ**

**గ్రామం నుండి ప్రపంచ స్థాయి వరకు అపోలో వైద్య సేవలు**

తవణంపల్లి మండలం అరగొండ గ్రామంలో 1933లో జన్మించిన డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి హైస్కూల్ చదువుల వరకు చిత్తూరులో చదువుకొన్నారు. అనంతరం చెన్నైలో ఉన్నత చదువులు చవిదిన ప్రతాప్ సి.రెడ్డి ఎంబిబిఎస్ పూర్తి చేసి విదేశాలకు వెళ్ళారు. 1970 సంవత్సరంలో భారదేశంకు వచ్చిన ఆయన మొట్టమొదటి సారిగా 1983లో చెన్నైలో అపోలో ఆసుపత్రిని ప్రారంభించారు. ఆసుపత్రిలో గుండె జబ్బులకు ప్రాధాన్యత ఇచ్చి వైద్య సేవలు అందించేవారు. అప్పటి నుండి అపోలో ఆసుపత్రిని అంచెలంచెలుగా ఆయన అభివృద్ధి చేశారు. ప్రస్తుతం 17 దేశాల్లో 73 అపోలో ఆసుపత్రుల శాఖలను ఏర్పాటు చేసి వైద్య రంగంలో ఆయన విశేష సేవలు అందిస్తున్నారు. వైద్య రంగంలో డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి చేసిన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఆయనకు 1991లో పద్మభూషణ్, 2010 సంవత్సరంలో పద్మవిభూషణ్ అవార్డులు ఇచ్చి సత్కరించింది. పలు సంస్థలు ఆయనకు భారీగా సత్కారాలు చేశాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డికి వైఎస్ఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు బహుకరించి సత్కరించనుంది.

**వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు**

వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు కట్టమంచి బాలకృష్ణారెడ్డి విశేషంగా కృషి చేశారు. స్వతహాగా రచయిత అయిన కట్టమంచి బాలకృష్ణారెడ్డి వ్యవసాయ రంగంలో రైతులకు ఉపయోగపడేలా పలు రచనలు చేశారు. ముఖ్యంగా జిల్లాలో మామిడి రైతులకు ఆయన సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు మామిడి పల్ప్ పరిశ్రమలను జిల్లాకు తీసుకురావడంతో ఆయన కీలక పాత్ర పోషించారు. మామిడి పంటలపై పలు రచనలు చేసిన కట్టమంచి బాలకృష్ణారెడ్డి మామిడి ఉత్పత్తులను మెరుగైన స్థితికి తీసుకురావడానికి సైతం కలం పట్టి కదిలారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం కట్టమంచి బాలకృష్ణారెడ్డికి వైఎస్ఆర్ అచీవ్‌మెంట్ పురస్కారంతో సత్కరించనుంది.

## షార్‌లో మారు మోగిన సమైక్యతా నినాదాలు



తడ,అక్టోబర్ 31 ప్రభాతవార్త: శ్రీహరికోట అంతరిక్ష కేంద్రంలో సోమవారం జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. 75 ఏళ్ళ స్వాతంత్ర దినోత్స సంబరాల్లో భాగంగా స్వాతంత్ర ఘట్టాలను ప్లేకార్డులు ద్వారా ప్రదర్శించారు. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలిస్తూ ఉత్సాహంగా ప్రదర్శనలో పాల్గొన్నారు. షార్ డైరెక్టర్ ఎ.రాజరాజన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో షార్ ఉద్యోగులు, సిఐఎస్ఎఫ్ దళాలు, ఎన్‌సిసి కేడెట్స్, పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొండూరు చెరువులో మద్యం బాటిళ్ల ధ్వంసం



తడ,అక్టోబర్ 31 ప్రభాతవార్త: తడ మండలం కొండూరు సమీపంలోని చెరువు స్థలంలో సోమవారం ఎక్సైజ్ పోలీసులు రు.1,60వేల విలువ కలిగిన 314లీటర్ల మద్యం బాటిళ్ళు ధ్వంసం చేశారు. సూళ్లూరుపేట స్పెషల్ ఎన్‌పోర్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో 2021 నుండి మొత్తం 115 కేసుల్లో స్వాధీనం చేసుకున్న బాటిళ్లను ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు జెసిబి యంత్రం సహాయంతో ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ సూర్యనారాయణ తెలిపారు.

## సుధీర్‌రెడ్డి దళిత ద్రోహి ఎలా అవుతారు?



శ్రీకాళహస్తి, అక్టోబర్ 31 ప్రభాతవార్త : నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి దళితద్రోహి ఎలా అవుతారని రాష్ట్ర పార్టీ సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు సుబ్రమణ్యం (బుజ్జి) అన్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్ బాలిక చద్రిత వారి తల్లిదండ్రుల తరపున న్యాయం కోసం నిలబడడం తప్పా అని ప్రశ్నించారు. బాలికను రామాపురం గ్రామానికి చెందిన గద్దెచంద్రశేఖర్ ప్రేమ పేరుతో తీసుకునివెళితే వారి తల్లిదండ్రులైన చిర్రి లలిత, చిర్రి ఠాగూర్‌లు గతంలో పోలీస్‌స్టేషన్‌లో చంద్రశేఖర్‌ను పట్టుకుని తమ బిడ్డను అప్పగించమని పిర్యాదు చేశారన్నారు. ఈనెల 20న కెవిబిపురం మండలంలోని తెలుగుగంగ కాలువలో గుర్తు తెలియని బాలిక శవం గుర్తించడం జరిగిందని దశంతో చిర్రిఠాగూర్ దంపతులు తమబిడ్డను చంద్రశేఖర్ చంపి గంగకాలువలో పడేసి ఉంటాడనే అనుమానంతో న్యాయం కోసం తమ యువ నాయకుడు సుధీర్‌రెడ్డిని సంప్రదించారన్నారు. సుధీర్‌రెడ్డి మైనర్‌బాలిక తల్లిదండ్రులకు న్యాయం కోసం పోరాడారు తప్ప దళితులకు వ్యతిరేకంగా కాదని గుర్తించుకోవాలన్నారు. చంద్రశేఖర్ విడుల చేసిన వీడియోలో తెలుగుదేశంపార్టీ నాయకుడు సుధీర్‌రెడ్డిని అమర్యాదగా మాట్లాడడం అతని స్థాయికి తగినదికాదని తెలుసుకోవాలన్నారు. వైఎస్ఆర్‌పార్టీ నాయకులు కూడా చంద్రశేఖర్ దళితుడా లేక అగ్రకులానికి చెందిన వాడా అనికాకుండా న్యాయం పక్కన తమ సుధీర్‌రెడ్డి నిలబడ్డారన్నారు.మైనర్ బాలికను తీసుకునివెళ్ళి వివాహం చేసుకోవచ్చా, చంద్రశేఖర్‌కు వివాహం అవలేదా చంద్రశేఖర్‌కు బిడ్డ ఉన్నది నిజం కాదా అంటూ చంద్రశేఖర్ పోలీసు వ్యవస్థను తప్పుదోవ పట్టించాడన్నారు. ఇన్ని తప్పులు చేసిన చంద్రశేఖర్‌కు మద్దతుగా వైకాపా పార్టీ నాయకులు నిలబడి సుధీర్‌రెడ్డిని దళితద్రోహి అనడం హాస్యాస్పదం అన్నారు. రాజకీయాలను రాజకీయంగానే ఎదుర్కొవాలే కానీ ఇలా కాదన్నారు. స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కుటుంబం ఎలాంటిదో ప్రజలందరికీ తెలుసన్నారు. ఇలాంటి కుట్రలు ఎన్ని చేసినా సుధీర్‌రెడ్డి మనోధైర్యాన్ని దెబ్బతీయలేరన్నారు. ఇప్పటికైనా వైకాపా నాయకులు ఇలాంటివి మానుకోవాలని హితవు పలికారు.

## అమరవీరుల కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటాం : ఎస్పీ



తిరుపతి క్రైం, అక్టోబర్ 31, ప్రభాతవార్త : పోలీస్ అమరవీరుల కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 10 రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా వ్యాసరచన, వకృత్వ పోటీలలో ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రంతో పాటు జ్ఞాపికలను, నగదును బహుమతులను ప్రధానం చేసారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అంతర్గత శత్రువులు, భహిర్గత శత్రువులను ఎదుర్కోవడంలో పోలీసుల త్యాగం ఎనలేనిదని ఈ పోరాటంలో అమరులైన పోలీస్ కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ పోలీస్ అమరవీరుల వారోత్సవాలను జరుపుకుంటున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 21వ తేది నుంచి 31వ తేది వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో వారోత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీస్ అమరవీరులని గుర్తు చేసుకోవడంతో పాటు సమాజంలో పోలీస్ శాఖ పాత్ర, విధులు, త్యాగాల గురించి ప్రజల్లో ఈ వారోత్సవాల ద్వారా అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి అడ్మిన్ సుప్రజ, ఎల్అండ్ఓ కులశేఖర్, క్రైం విమలకుమారి, తిరుమల మునిరామయ్య, డిఎస్పిలు, ఎస్‌బి వెంకటరమణ, వెస్ట్ నరసప్ప, ఈస్ట్ మురళీకృష్ణ, ట్రాఫిక్ కాటమరాజు, ట్రాఫ్ 2 విజయశేఖర్, సిసిఎస్. సుధాకర్, దిశా రామరాజు, కమాండ్ కంట్రోల్ కొండయ్య, ఏఆర్‌డిఎస్‌పి నంద కిషోర్, సిఐలు ఎంఆర్‌పల్లి సరేంద్ర రెడ్డి, తిరుచానూరు సుబ్రమణ్యం రెడ్డి, ఎస్‌వియు సాయినాథ్, ఆర్ఐలు శ్రీనివాసులు, రెడ్డప్ప రెడ్డి, చంద్రశేఖర్, నాగభూషణం, ఆర్ఎస్ఐలు నదియా, పుల్లన్న, ఖాసీం ఎస్వీ బిపిఇడి విద్యార్థులు, ఎస్‌వి డిఫెన్స్ అకాడమి విద్యార్థులు, స్కూల్ విద్యార్థినీలు, పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ సోమశేఖర్, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజలకు పోలీసుశాఖకు వారధిగా సేవలు

**-విశ్రాంత గెజిటెడ్ పోలీసుఅధికారుల సంఘం**



తిరుపతి,అక్టోబర్ 31 ప్రభాతవార్త: సమాజంలో ప్రజాసేవ చేయడంతో బాటు, ప్రజలకు పోలీసుశాఖకు అవసరమైన సూచనలు, సేవలందించేందుకు విశ్రాంత గెజిటెడ్ పోలీసు అధికారుల అసోసియేషన్ సిద్ధంగా ఉంటారని పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించుకుని ఆ దిశగా పనితీరు సాగించనున్నామని తెలిపారు. తిరుపతి పోలీసు జిల్లా పరిధిలో తిరుపతి విశ్రాంత గెజిటెడ్ పోలీసు అధికారుల అసోసియేషన్ నాయకులు సమావేశమయ్యారు. అంతేగాక కౌన్సిలింగ్ కేంద్రాల వద్ద విశ్రాంత పోలీసు అధికారుల సేవలను ప్రజలకు అందించేందుకు ఎన్జీఓ కాలనీలో "మే ఐ హెల్ప్ యు"పేరుతో కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. విధుల్లో ఉన్న ప్రస్తుత పోలీసు సిబ్బందికి న్యాయపరంగా మహిళల రక్షణ,భద్రత, కేసుల విచారణ సమయంలో అనుసరించాల్సిన వ్యూహం పై తగిన సూచనలు, సలహాలు, శిక్షణ ఇచ్చేందుకు ఎస్‌పి ఆదేశాలు తీసుకుని పనిచేయాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో విశ్రాంత గెజిటెడ్ పోలీసు అధికారుల అసోసియేషన్ సభ్యులు విశ్రాంత అదనపు ఎస్పీ జి.నారాయణస్వామి, పి.అభిషేకం, నంజుండప్ప, లక్ష్మీరెడ్డి, సుబ్రమణ్యం, రామారావు, సాంబశివారెడ్డి, పోతప్ప, కరుణాకర్, ఈశ్వరయ్య, రామకృష్ణ, శ్రీనివాసులు, వెంకటరమణ,వెంకటప్ప, సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కోవిడ్‌తో మృతిచెందిన వారికి సంతాపం తెలిపారు.

## శివరాత్రిని మరపించిన ఆలయం -లఘుదర్శనంతో సుదర్శనం



శ్రీకాళహస్తి,అక్టోబర్ 31 ప్రభాతవార్త : కార్తీక మాసం మొదటి సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయం శివరాత్రిని మరపించింది. ఎటు చూసినా భక్త జనమే.ఉదయం నుంచి ఆలయంలో శివనామస్మరణతో మార్మోగింది.అయితే కార్తీక మాసం లోభక్త జనులకు సంబంధించి అవగాహన ఉన్న ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆలయాధికారులు ఇఒ వికెసాగర్‌బాబు చక్కటి ఏర్పాట్లు చేసారు. ఎవ్వరికి ఇబ్బంది లేకుండా లఘుదర్శనంతో సుదర్శనం ఏర్పాటు చేసారు.కార్తిక మాసంలో శివదర్శనం శ్రేష్టమని చెబుతారు.అయితే దక్షిణ భారత దేశంలోని శైవ క్షేత్రాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నాడు. అయితే భక్తిభావంతో పంచభూత లింగాల్లో ఒకటైన వాయులింగేశ్వరుని దర్శనానికి వచ్చిన భక్తులకు సరైన సమాచారం లేక తిప్పలు తప్పలేదు. ఇక దళారీ వ్యవస్థపై ఎన్ని చర్యలు తీసుకుంటున్నా కట్టడి కావటం లేదు.ఈ నేపధ్యంలో కార్తిక మాసం మొదటి సోమవారం భక్తులు తండోపతండాలుగా కదలి వచ్చారు. భక్తుల సమాచారం కోసం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో కనీసం సమాచారం ఇచ్చే వారు కూడా కరువయ్యారు.దాంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఇక ఆలయంలో వెళ్ళిన తరువాత పూజలు చేయించుకోవటానికి నిరీక్షించుటకు సరైన సదుపాయాల్లేదు.

## కార్తీక దీపపు మండపం ప్రారంభం:



శ్రీకాళహస్తి,అక్టోబర్ 31 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం ప్రత్యేకంగా మహిళలు దీపాలు వెలిగించుటకు ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేసారు. ఆలయానికి ప్రవేశించే బిక్షాల గాలిగోపురం సమీపంలో రంగుల గోపురం వద్ద ప్రత్యేక షెడ్డును ఏర్పాటు చేసారు. అలాగే అక్కడ స్వామి వారి ప్రతిమను ఏర్పాటు చేసారు. కాగా నాల్గవ గేటు వద్ద బ్రహ్మగుడి సమీపంలోని ఏర్పాట్లు చేసారు. మణికంఠేశ్వరాలయం వద్ద మహిళా భక్తుల మనోభావాలకు అనుగుణంగా దీపాలు వెలిగించుకొనుటకు వేదికలు సిద్ధం చేసారు.దాంతో ఏ ప్రాంతం మహిళలు ఆ ప్రాంతంలో దీపాలు వెలిగించుకొనుటకు చేసిన ఏర్పాట్లుపై సంతృప్తి పొందారు. దీపాలు వెలిగించే కార్యక్రమాల్లో ఆలయ ఇఒ వికెసాగర్ బాబు, డెప్యూటి ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, సభ్యులు కొండూరు సునీత, లక్ష్మీ ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ పారోహితులు అర్ధగిరి స్వామి, ఆంజనేయ శర్మ, పరిచారకులు గోవింద్‌శర్మ, చందు భక్తులు పాల్గొన్నారు.

కపిలేశ్వర ఆలయంలో...

## వైభవంగా దక్షిణామూర్తి హోమం



తిరుపతి,అక్టోబర్ 31ప్రభాతవార్త: కార్తీకమాస విశేష హోమాల్లో భాగంగా కపిలేశ్వర ఆలయంలో జరుగుతున్న పూజల్లో సోమవారం దక్షిణామూర్తి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం యాగశాలలో 8గంటల నుంచి 11గంటల వరకు దక్షిణామూర్తి హోమం, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, మహాశాంతి అభిషేకం ,దక్షిణామూర్తి కలశాభిషేకం నిర్వహించారు. విశేషదీపారాధన జరిగింది. నేడు కాలభైరవస్వామి హోమం జరగనుంది. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఇఒ దేవేంద్రబాబు, ఏఇఒ శ్రీనివాసులు, సూపరింటెండెంట్లు భూపతి, శ్రీనివాసులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సమీక్షలో సూచించన అభివృద్ధి పనులపై దృష్టి

**-తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి**



తిరుపతిరూరల్, అక్టోబర్31 ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్య మంత్రి వైయస్. జగన్మోహన్‌రెడ్డి సమీక్షలో సూచించన అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆగష్టు 3న జరిగిన ముఖ్యమంత్రి సమీక్షలో తిరుపతి జిల్లా నియోజక వర్గాల అభివృద్ధి పెండింగ్ పనులపై సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో కలెక్టర్ మట్లాడుతూ జిల్లా ఎమ్మెల్యేలు, పార్లమెంట్ సభ్యులు నియోజకవర్గాలవారీగా ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించిన విషయం తెల్సిందే అన్నారు. నీటి పారుదలశాఖ చేపట్టాల్సిన చెక్ డ్యామ్‌లు, కాల్వ మరమ్మతులు, గ్రామీణ నీటి పారుదల శాఖ చేపట్టాల్సిన పనులు, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ శాఖలు రహదారుల బదలాయింపు, వైద్యశాఖ ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలలో పడకల పెంపు, వెంకటగిరి స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాల స్థలం ప్రతిపాదనలు, కాజ్ వే ల నిర్మాణాలు, నీటి ప్రాజెక్టుల నిర్మాణ పనులు, ఎఫ్ డి. ఆర్ పెండింగ్ నిధుల వివరాలు, రైల్వే బ్రిడ్జి పనులు వంటి వాటిపై నియోజకవర్గాల వారీగా ప్రతిపాదనలను, మంజూరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ఆర్థికశాఖ వద్ద పెండింగ్ లేకుండా చూడాల్సి ఉంటుందని, ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. ఈ సమీక్షలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నూతన భవనంలో నగరపాలక సంస్థ సేవలు: కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 31 ప్రభాతవార్త : తిరుపతి నగర పాలక సంస్థసేవలు బుధవారం నుంచి ప్రజలకుపూర్తి స్థాయిలో మెటర్నటి ఆసుపత్రి పక్కన తాత్కాలిక నూతన భవనంలో ప్రజలకు అందుబాటులో వుంటుందని కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. మంగళవారం సాధారణ కౌన్సిల్ సమావేశం పాత కార్యాలయంలో జరుగుతుందని వివరిస్తూ అనంతరం మొత్తం సేవలు నూతన భవనం నుంచి జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతమున్న మున్సిపల్ భవనం స్థానంలో సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మిస్తున్నట్లు మరో 18 నెలల కాలంలో పనులను పూర్తి చేసి నగర పాలక సంస్థ కార్యాలయం ప్రారంభించేత వరకు తాత్కాలిక భవనం నుండి పురసేవలకు ప్రజలకి అందించడం జరుగుతుందని కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు.

## సమైక్య భారత్ కోసం పటేల్ చేసిన కృషి చిరస్మరణీయం

**- జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్**



చిత్తూరు, అక్టోబర్ 31 ప్రభాతవార్త: దేశ స్వాతంత్ర్యానంతరం సమైక్య భారత్ కోసం సంస్థానాలు, చిన్న రాష్ట్రాలు దేశంలో విలీనం చేయడానికి ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి చిరస్మరణీయమని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని సోమవారం జిల్లా నెహ్రూ యువకేంద్రం, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సంయుక్తంగా నిర్వహించిన 2కె రన్‌ను జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ జెండా వూపి ప్రారంభించారు. చిత్తూరు గాంధీ సర్కిల్‌లో ప్రారంభమైన ఈ 2కె రన్ మున్సిపల్ కార్యాలయం మీదుగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని జిల్లా విద్యాశాఖ, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, జిల్లా నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో వందకు పైగా ర్యాలీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం, సెట్విన్ సిఇఒ మురళీకృష్ణ, జిల్లా యువజన అధికారి ప్రదీప్‌కుమార్, చీఫ్ కోచ్ ఎ.బాలాజీ, నెహ్రూ యువకేంద్రం ప్రాంతీయ గణాంకాధికారి బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు



సదుం,అక్టోబరు 31 ప్రభాతవార్త : మండల పరిధిలో కార్తీక సోమవారం సందర్భంగా పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. యర్రాతివారి పల్లెలోని అయ్యప్ప ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. నడిగడ్డ మతుకువారిపల్లె వద్ద ఉన్న మల్లేశ్వరస్వామివారి ఆలయంలో ఉదయం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు కేదారేశ్వర వ్రతాలు ఆచరించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. సదుంలోని గార్గేయనది ఒడ్డున ఉన్న మరకత లింగేశ్వరస్వామి వారి ఆలయంలో వివిధ వృక్షాల కింద భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.

## మూటలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం



కుప్పంరూరల్, అక్టోబర్ 31 ప్రభాతవార్త: కుప్పం -కృష్ణగిరి జాతీయ రహదారిలోని పున్నమి టూరిజం హోటల్ వద్ద ఉన్న వీరప్పనాయని చెరువు మరువ వద్ద ఓ మూటలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. స్థానికులు అటుగా వెళ్తుండగా దుర్వాసన రావడంతో కుప్పం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై శివకుమార్ సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహంను పరిశీలించారు. ఈ మృతదేహాన్ని ఎవరైనా బయటి ప్రాంతాలనుంచి తెచ్చి ఇక్కడ పడేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు.

## సూళ్లూరుపేటలో భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం



సూళ్లూరుపేట, అక్టోబర్ 31 ప్రభాతవార్త : కార్తీక మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని సూళ్లూరుపేటలోని అభయ కల్యాణ మహేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు నూతనంగా తయారు చేసిన నాగపడిగను స్వామివారికి అలంకరించారు. అనంతరం ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే శ్రీనాగేశ్వర స్వామి దేవస్థానంలో నాగేశ్వరస్వామికి పుష్పాలంకరణ ప్రత్యేకంగా చేశారు. ఆలయ ఛైర్మన్ చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, అర్చకులు పెల్లేటి సునీల్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం మహిళా భక్తులు పెద్దఎత్తున కార్తీక దీపాలు వెలిగించి స్వామివారికి పూజలు చేశారు.

## స్పందన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 31, ప్రభాతవార్త : స్పందన ఫిర్యాదులకు, అదే విధంగా డయల్ యువర్ కమిషనర్‌కి వచ్చే ఫిర్యాదులు, అర్జీలకు తగిన ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని మేయర్ డా. శిరీష, కమిషనర్ అనుపమ అంజలి అధికారులకు సూచించారు. సోమవారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమంలో మేయర్ డా. శిరీషా, కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ ఫిర్యాదులను పరిశీలిస్తూ ఆటో నగర్, కృష్ణా నగర్ ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని ఆ కాలనీ వాసులు తెలుపగా త్వరలోనే పరిశీలించి పనుల చేపడతామన్నారు. కెనడి నగర్‌లోతమ ఇంటి ముందు వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని గృహాలు వుండే చోట వాణిజ్య సముదాయాలు నిర్మించడం వలన ఈ సమసనయ ఉత్పన్నమవుతున్నదనే ఫిర్యాదుపై తమ టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 18వ వార్డులో ఓ వ్యక్తి రోడ్డును ఆక్రమించడం వలన ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని కొంత మంది ప్రజలు ఫిర్యాదు చేయగా వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ఎల్‌బి నగర్‌లో ప్రభుత్వ బావిని ఆక్రమించి మెకానిక్ షాపును ప్రారంభించారనే ఫిర్యాదు పై తక్షణమే అధికారులు పంపించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామి రెడ్డి , రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, లోకేష్ వర్మ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్. హరికృష్ణ, సెక్రటరి రాధిక, మేనేజర్ చిట్టిబాబు, డిఈలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## దుర్గంధభరితం ఆర్టీసీ ప్రాంగణం



కోట, అక్టోబర్ 31 ప్రభాతవార్త : కోట ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో పారిశుధ్యం పడకేసింది. ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో చెట్లు పుట్టలతో నిండిపోయింది. దీంతో ఆర్టీసీ స్థలమే కదా అని పట్టణంలోని పలువురు తమ నివాసాల్లోని చెత్తాచెదారాన్ని ఆర్టీసీ ప్రాంగణంలో పోస్తున్నారు. దీంతో ఆ చెత్తలో పందులు, పశువులు వచ్చి స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ క్రమంలో ఆర్టీసీ బస్టాండుకు వచ్చే ప్రయాణికులు దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో అయితే ఆర్టీసీ బస్టాండు పరిసరాల్లో విషసర్పాలు సంచరిస్తున్నాయి. గ్రామాల్లో పరిశుభ్రత కల్పనకు చెత్త అవరోధంగా మారింది. ఇకనైనా ఆర్టీసీ అధికారులు, పంచాయతీ పాలకులు ఆర్టీసీ ప్రాంగణంలో చెత్తాచెదారం వేయకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## ఆకాశ దీపాన్ని వెలిగించిన ఎంఎల్ఏ సతీమణి



శ్రీకాళహస్తి,అక్టోబర్ 31 ప్రభాతవార్త : కార్తీక మాసం శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం సాయంత్రం 'ఆకాశ దీపాన్ని' శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి సతీమణి బియ్యపు వాణి వెలిగించారు.ఈ కార్యక్రమాల్లో ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఎసి మల్లికార్జున్ ప్రసాద్, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్,నరసింహారాజు(నంద) లక్ష్మీపతి, రవి,చింతామణి పాండు,శ్రీదేవిలు పాల్గొన్నారు.

## జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధిగా పి.కీర్తన



తిరుపతి ప్రెస్‌క్లబ్,అక్టోబర్ 31 ప్రభాతవార్త: జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధిగా తిరుపతికి చెందిన పరింగిశెట్టి కీర్తన నియమితులయ్యారు.ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ సోమవారం నియామక పత్రాన్ని ఆమెకు మెయిల్ ద్వారా పంపడం జరిగింది.ఈ సందర్భంగా కీర్తన మాట్లాడుతూ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నందుకు అధినేత గుర్తించి తనకు ఈ పదవి ఇవ్వడం జరిగిందన్నారు. రాబోవు 2024 ఎన్నిల్లో పార్టీ విజయానికి తనవంతు కృషి చేస్తానన్నారు.



## ఏపిఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్‌కు పదవీకాలం పొడిగింపు

తిరుపతి ప్రెస్‌క్లబ్,అక్టోబర్ 31 ప్రభాతవార్త: ఏపిఎస్‌పిడిసిఎల్ తిరుపతి శాఖలో డైరెక్టర్(ఫైనాన్స్)గా విధులు నిర్వహి స్తున్న వి.ఎన్.బాబుకు ప్రభుత్వం మరో రెండేళ్ల పదవీ కాలం పొడిగించింది.ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.